క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీఓగా విజయలక్ష్మి



బుచ్చెయ్యపేట : మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పి.విజయలక్ష్మిని నియమించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న వి.విజయలక్ష్మి ఈ నెల 14వ తేదీన తన ఇంట్లో కాలుజారి తలకి గాయమవడంతో కోమాలోకి వెళ్లిపోయారు. విశాఖ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె 18వ తేదీన మృతి చెందారు. ఈ నేపథ్యంలో బుచ్చెయ్యపేటలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న పి. విజయలక్ష్మిని ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ కలెక్టరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో గురువారం బాధ్యతలు స్వీకరించారు.

దేవరాపల్లి పశువైద్యాధికారిగా గాయిత్రీదేవి



దేవరాపల్లి: దేవరాపల్లి మండల పశువైద్యాధికారిగా జి. గాయిత్రీదేవి గురువారం బాధ్యతలు చేపట్టారు. చీడికాడలో పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమెకు స్థానిక ఆసుపత్రి సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పశువులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. పశు సంవర్ధకశాఖ ద్వారా అందించే ప్రతి కార్యక్రమాన్ని పాడి రైతులకు, ప్రజలకు చేరవేసేలా కృషి చేస్తామన్నారు. కాగా ఇది వరకు ఇక్కడ పశువైద్యాధికారిగా పనిచేసిన అలేఖ్య నాతవరం మండలం గునిపూడికి బదిలీపై వెళ్లారు.

గంటికొర్లాం తలయారీ మృతి


పోతురాజు(ఫైల్)

బుచ్చెయ్యపేట : మండలంలో గల గంటికొర్లాం తలయారీ మోసా పోతురాజు(65) మృతి చెందారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇతను గురువారం తన ఇంటి వద్ద మృతి చెందారు. గత 40 ఏళ్లుగా గ్రామ తలయారీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి భార్య కన్నయమ్మ ,వివాహమైన ఇద్దరు కుమార్తెలు,కుమారుడు ఉన్నారు. మండల వీఆర్వో సంఘం అధ్యక్షుడు శ్రీను, మండల తలయారీలు గంటికొర్లాం వెళ్లి పోతురాజు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తహసీల్దార్ లక్ష్మి,హెచ్‌డీటీ మురళి, ఆర్ఐలు,వీఆర్వోలు తదితర్లు తలయారీ కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపి ప్రభుత్వ సహాయం అందేలా చూస్తామన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

నాతవరం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసామని ఎంపీడీవో కె.ఉషాశ్రీ అన్నారు. ఆమే విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు హజరు కావాలన్నారు. మండల స్థాయిలో గల అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ


రోడ్డుమధ్య డివైడర్లపై చిక్కుకున్న లారీ

మాకవరపాలెం: డివైడర్‌ను లారీ ఢీకొటిన సంఘటనలో భారీ ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండు సమీపంలో గురువారం ఉదయం నర్సీపట్నం వైపు వెళుతున్న లారీ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. అటుగా వెళుతూ ఒక్కసారిగా డివైడర్లపైకి దూసుకుపోయి మధ్యలో చిక్కుంది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం


గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్యులు

రావికమతం : కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి మోహిని సురేఖ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాలైన అజేయపురం, రాయిపాడులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. రాయిపాడు గ్రామంలో గల వైద్య శిబిరానికి 38 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. జ్వరాలు ఉన్న ఇద్దరికి రక్త పరీక్షలు చేసి సాధారణ జ్వరాలుగా నిర్ధారించారు. అజేయపురంలో 34 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. జ్వరాలు ఉన్న ఆరుగురికి రక్త పరీక్షలు చేయగా వారిలో ఒకరికి మలేరియా ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందని వైద్యాధికారి మోహిని సురేఖ తెలిపారు. వారికి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్ రమణ, వైద్య సిబ్బంది, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండలు తవ్వేస్తున్నారు...!

- యథేచ్ఛగా అక్రమ మెటల్ క్వారీలు
- రాత్రికి రాత్రే కొండలు పిండి
- పట్టించుకోని రెవెన్యూ, మైన్స్ అధికారులు


సంబారువానిపాలెం-ఎం.కొత్తపల్లి ప్రాంతంలో అక్రమ క్వారీ

చోడవరం : మండలంలో అక్రమ మెటల్ క్వారీ యథేచ్ఛగా సాగుతోంది. రెవిన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఎవరికి తోచినంత వారు కొండలను తవ్వేసుకుంటున్నారు. అంబేరుపురం, అడ్డూరు, గంధవరం, బెన్నవోలు, ఖండిపల్లి, దుడ్డుపాలెం, ఎం. కొత్తపల్లి, సంబారువానిపాలెం, వెంకన్నపాలెం, నర్సాపురం, రాయపురాజుపేట, ముద్దుర్తి, భోగాపురం గ్రామాల పరిధిలో ఉన్న కొండల్లో అక్రమ మెటల్ క్వారీలు నడుస్తున్నాయి. దోచుకున్న వారికి దోచుకున్నంతగా ఈ కొండలను కొల్లగొడుతున్నారు. వాస్తవానికి గ్రావెల్ మెటల్ తవ్వకాలు, రవాణాచేయాలంటే ముందుగా రెవిన్యూ, మైన్స్ శాఖల అనుమతి పొందాల్సి ఉంది. కానీ చోడవరం మండలంలో మాత్రం అవేమీ లేవు. స్థానిక అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో ఎవరికి తోచినంత వారు తవ్వేసుకొని తరలించుకుపోతున్నారు. ఎం.కొత్తపల్లి, గంధవరం, ఖండిపల్లి, భోగాపురం, దుడ్డుపాలెం, అడ్డూరు క్వారీల్లో పొక్లెయిన్, జేసీబీ యంత్రాల సాయంతో ఎక్కడికక్కడ కొండను తవ్వేసి లారీలు, ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారు. రాత్రి సమయాల్లో ఎక్కువగా ఇక్కడ క్వారీయింగ్ జరుగుతుంది. దీనికి స్థానిక అధికారపార్టీ నాయకుల సహకారం కూడా ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొండలను తవ్వేసి మెటల్‌ను అమ్మేసుకుంటున్నా పట్టించుకునే నాథేడే లేకుండా పోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఈ దందా నడుస్తున్నట్టు తెలిసింది. గంధవరం, అడ్డూరు గ్రామాల్లో రియల్టర్లు పక్కనే ఉన్న కొండల నుంచి గ్రావెల్ మెటల్, మట్టిని తవ్వేసి భూములను ఎత్తుచేసి ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. కొందరు స్థానిక వీఆర్వోల సహకారంతోనే ఇదంతా జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన మండల రెవిన్యూ అధికారులు అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గడంతో అక్రమ క్వారీలు ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి కొండలను తవ్వేస్తున్నారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మైనింగ్ శాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై కూడా అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇలా అనుమతి లేకుండా కొండలను తవ్వేసుకోవడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రాకపోగా పర్యావరణాన్ని పరిరక్షించే కొండలు, పచ్చదనం కూడా నాశనమయ్యే ప్రమాదం ఏర్పడింది. దీనిపై మైన్స్, రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కార్మికుల ఆందోళన


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నర్సీపట్నం : మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గొర్లి మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం మున్సిపల్ కార్మికులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఏపీసీఓఎస్ రద్దు చేస్తే కార్మికులందరిని పర్మనెంట్ చేయాలన్నారు. పర్మనెంట్ కార్మికుల వలే మాకు పదవీ విరమణ 62 ఏళ్లకు పెంచాలన్నారు. ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాట్యుటీతో పాటు కనీస పింఛను రూ.10 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు మాకిరెడ్డి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షుడు యర్రా ప్రకాష్, కోశాధికారి లాలం నాగేంద్ర, వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ జాతర


మరిడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: మాడుగుల నుండి ఖండివరం వెళ్లేదారిలో వెలసిన మరిడిమాంబ జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ జాతర మోదకొండమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మరిడిమాంబ రైతు సంఘం సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు ఇతర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా మరిడిమాంబ జాతర నిర్వహించడం వల్ల పంటలు బాగా పండుతాయని, ఈ ప్రాంత రైతుల విశ్వాసం.

విద్యుత్ స్తంభానికి మంటలు



కె.కోటపాడు : కె.కోటపాడు పశువైద్య కేంద్రం, సీహెచ్‌సీ ప్రహరీ సమీపంలో గల విద్యుత్ స్తంభానికి గురువారం మంటలు వ్యాపించాయి. ఈ స్తంభాన్ని ఆనుకొని పిచ్చి మొక్కలు విస్తారంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే సమీప సీహెచ్‌సీలో గల వ్యర్థాలను, స్థానికులు చెత్తను వేస్తుంటారు. ఈ చెత్తకు ఉదయాన్ని నిప్పటించడంతో విద్యుత్ స్తంభానికి మంట వ్యాపించింది. సమీపంలో ఉన్న సబ్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందడంతో విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేసారు. దీంతో స్థానికులు మంటలను నీటితో అదుపు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో గల విద్యుత్ స్తంభానికి ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో పలువురు ఆందోళన చెందారు. వెంటనే విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేసి మంటలు అందుపు చేయడంతో పెనుప్రమాదం తప్పిందని పలువురు ఊపిరి పీల్చుకున్నారు.

49 మంది ఉపాధ్యాయులు బదిలీ


ఎంఈవో పాండురంగారావు

మాడుగుల: మాడుగుల మండలం నుంచి 49 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్ళారని ఎంఈవో-1 ఎం. పాండురంగారావు అన్నారు. మండలంలో 12 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఉండడం వలన మండలానికి 51 మంది ఉపాధ్యాయులు కొత్తగా వచ్చి చేరారన్నారు. ప్రస్తుతం పాఠశాలలో అడ్మిషన్‌లు కొనసాగుతున్నాయన్నారు. పాఠ్య పుస్తకాలతో ఏకరీతి దుస్తులు మండలంలో ప్రాథమిక, మోడల్‌ప్రైమరీలతో పాటు హైస్కూళ్లకు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలలో యోగా జరిపించి తరగతి వారీలుగా అప్లోడ్ చేయాలన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ


అర్జునగిరిలో మరిడిమాంబను దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలునాయుడు

చీడికాడ: అర్జునగిరి మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు దర్శించుకున్నారు. సర్పంచ్ బోడాల రమాదేవి, శ్రీనివాస్, దేవరాపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బూరె బాబూరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పరువాడ నాయుడుబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెంటకోట నూకునాయుడు, పార్టీ నాయకులు కోవిలపల్లి పైడిబాబు, అద్దిపల్లి నర్సింహమూర్తి,సూరిబాబు, సింహాచలంనాయుడు, మైచర్ల ముత్యాలునాయుడు, నర్సింహమూర్తి, చిన్నంనాయుడు, అచ్చిమినాయుడు, ఉపేంద్ర, అప్పలనాయుడు పాల్గొన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

120 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు


ముషిడిపల్లిలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి: ముషిడిపల్లిలో విశాఖపట్నం ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కంటి వైద్య శిబిరంలో ఎల్.వి. ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 38 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. 22 మందికి కంటి అద్దాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మతల నానాజీ, బొడ్డు పెద అప్పారావు, బొడ్డు నారాయణమూర్తి, మతల వెంకునాయుడు మాష్టారు, కూనరెడ్డి శివకుమార్, గొర్లి నాయుడుబాబు, రెడ్డి మహేష్, రెడ్డి గణేష్ పాల్గొని సహకారం అందించారు.

అవంతి విద్యార్థులకు యోగా శిక్షణ


యోగా శిక్షణ పొందుతున్న అవంతి విద్యార్థులు

మాకవరపాలెం: యోగాంధ్రలో భాగంగా అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఈ నెల 21న జరిగే యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత వారం రోజులుగా కళాశాలలో వెయ్యి మందికి యోగాలో శిక్షణ ఇస్తున్నారు. వీరంతా 21న విశాఖ తరలివెళతారని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు గురువారం తెలిపారు. నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని, నిత్యం విద్యార్థులు యోగాకు కొంత సమయం కేటాయించాలని కోరారు.

ఇలా వదిలేస్తే ఎలా..?


కె.జె.పురం జంక్షన్‌లో సిమెంటు రహదారి నిర్మించిన చోట గ్రావెల్ వేయాల్సిన ప్రదేశం


రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వేయకపోవడంతో ప్రమాదకరంగా వున్న రహదారి

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో రహదారి నిర్మాణంలో భాగంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు కిరువైపులా గ్రావెల్ ఫిల్లింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. వడ్డాది నుంచి తాటిపర్తి వరకు నిర్మిస్తున్న రహదారి నిర్మాణంలో భాగంగా, కె.జె.పురం జంక్షన్‌లో సుమారు 300 మీటర్లు మేర సిమెంటు రహదారి నిర్మించారు. ఈ రహదారి కిరువైపులా గ్రావెల్‌తో పూరించాలి. గ్రావెల్‌తో పూరించకపోవడం వల్ల ప్రస్తుతం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిలో ఎం.కోటపాడు, వల్లాపురం వద్ద నిర్మించిన సిమెంటు రహదారి కిరువైపులా గ్రావెల్ ఫిల్లింగ్ చేశారు. అయితే కె.జె.పురం జంక్షన్‌లో మాత్రం సిమెంటు రోడ్డు నిర్మించి, గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టక పోవడం వల్ల జంక్షన్ నుంచి గ్రామంలోకి పోవు రహదారిలో పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే బురదలో ప్రయాణం చేయాలని వస్తుందని ప్రజలు ఆందదోళన చెందుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు కిరువైపులా గ్రావెల్ ఫిల్లింగ్ చేపట్టాలని కోరుతున్నారు.

రైతులకు విత్తనాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే


రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధికారులు

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు రైతులకు అవసరమైన వరి విత్తనాలు పంపిణీ చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోగల రైతు భరోసా కేంద్రంలో గురువారం ఖరీఫ్ సాగుకు వరి విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోఎంపీపీ మాట్లాడుతూ జిల్లాలోనే నాతవరం మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అధిక విస్తీర్ణంలో వరి పంట రైతులు సాగు చేస్తారన్నారు. తాండవ రిజర్వాయరు నీరు ఆధారం ఉండడంతో రైతులు ధైర్యంగా వరి పంట సాగు చేస్తారన్నారు. అందుచేత రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వరి విత్తనాలు సక్రమంగా అందించాలన్నారు. ఈ విషయంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం వ్యవసాయాధికారి సుగుణ మండలానికి వచ్చిన విత్తనాలు వివరాలు వెల్లడించారు. మొత్తం 1700 క్వింటాళ్ల వరి విత్తనాలు వచ్చాయన్నారు. వాటిలో ఆర్‌జీఎల్ 2537 రకం 850 క్వింటాళ్లు, యంటీయు 1064 రకం 761 క్వింటాళ్లు, యంటీయు 1061రకం 72 క్వింటాళ్లు, యంటీయు 1318 తొమ్మిది క్వింటాళ్లు, బిపిటి 5204 రకం 20 క్వింటాళ్లు విత్తనాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిగా చైర్మన్ కరక సత్యనారాయణ మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు పైల పోతురాజు వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన అవసరం


ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన

దేవరాపల్లి : సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అవగాహనతోనే ఈ వ్యాధి నిర్మూలన సాధ్యపడుతుందని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్యమేఘన అన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై వైద్య సిబ్బందితో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. సికిల్ సెల్ వ్యాధి వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహమని, రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపబూయిష్టంగా ఉంటాయన్నారు. ఈ వ్యాధి సంక్రమించిన వారిలో రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్ర ఒళ్లు, కాళ్ల నొప్పులు, శ్వాసకోస సమస్యలు, అలసట, తరుచూ అంటు వ్యాధులు, గర్భధారణ సమస్యలు, అవయవాల వైఫల్యం తదితర లక్షణాలు, సమస్యలు ఉత్పన్నమవుతాయని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వో ఎం.ఆనంద్, ఏఎన్ఎంలు హైమా, ఆర్. సత్యవతి, జి.పుష్ప, శాంతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గండిపడాలకు ముత్యాలనాయుడు పరామర్శ


రాములమ్మ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : మండల సీనియర్ నాయకుడు, కాంట్రాక్టర్ గండిపడాల అప్పలరాజు మాతృమూర్తి గండిపడాల రాములమ్మ (85) గురువారం ఉదయం కన్నుమూశారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రాములమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లలితానాయుడు, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, కొప్పల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఉపాధ్యక్షుడు చల్లా నాయుడు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, కూండ్రపు అప్పలనాయుడు, కొరుప్రోలు శ్రీను, చొక్కాకుల రమణ ఉన్నారు.

వరి విత్తనాలను పారదర్శకంగా పంపిణీ చేయాలి


బోయిలకింతాడలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్‌బూరె బాబూరావు

దేవరాపల్లి: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఖరీఫ్ వరి విత్తనాలను రైతులకు పారదర్శకంగా పంపిణీ చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు సూచించారు. ఈ మేరకు బోయిలకింతాడ రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ వరి విత్తనాలను గురువారం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. పది రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.యశోద, గోవాడ సుగర్స్ అభివృద్ధి మండలి డైరెక్టర్ అన్నం రాము, వైఎస్సార్‌సీపీ మండల వ్యవసాయ విభాగం అధ్యక్షుడు అన్నం రామునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీను, అన్నం సాంబమూర్తి, అన్నం వెంకటరావు, గొరపల్లి కృష్ణారావు, బొబ్బిలి శ్రీను, కడిమి నాగేశ్వరరావు, కొమర బాబూరావు పాల్గొన్నారు.

7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


ఎం. కోటపాడులో మాట్లాడుతున్న ఎలుసూరి గాటీలు


చొడువాడలో మాట్లాడుతున్న జిల్లా ప్రచార కార్యదర్శి శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: వచ్చే నెల 7వ తేదీన ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఎం.ఎస్.పి. జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి గాటీలు మాదిగ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎం. కోటపాడులో ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, జిల్లా ఎంఆర్‌పీఎస్ ఎంయస్‌పి ఎంఈపి ఇన్‌చార్జి పోసపల్లి వెంకట్రావు మాదిగ సూచనల మేరకు వచ్చే నెల 7 వ తేదీన ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని ఆయన కోరారు. మంద కృష్ణ మాదిగ కృషి వల్ల ఏబీసీ వర్గీకరణ అమలు కావడం, కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఎంఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కడిత అప్పారావు, ఎంఆర్‌పీస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా ఎలుసూరి అప్పారావు, మహిళా అధ్యక్షురాలిగా రాజ్యలక్ష్మిని ఎకగ్రీవంగా ఎన్నిక చేశారు.

కె.కోటపాడు : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని జూలై 7న కె.కోటపాడులో నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు అన్నారు. చొడువాడలో గల ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో మాదిగ మహిళా నాయకురాలు అనిత, అనకాపల్లి రాజు, జీవరత్నం పాల్గొన్నారు.

వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిన్నారావు



నర్సీపట్నం : వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.చిన్నారావును నియమిస్తూ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతిక శుక్ల ఉత్తర్వులు జారీ చేశారు. జి.చిన్నారావు నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీస్ జేఎల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతిపై ఆయన వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. పదోన్నతిపై వెళ్తున్న చిన్నారావుకు తోటి అధ్యాపకులు అభినందనలు తెలియజేసారు.

అధికలోడుతో ఇక్కట్లు


ఎత్తులోడుతో వెళుతున్న గడ్డి ట్రాక్టరు

రోలుగుంట : ఎత్తులోడుతో ప్రమాదా లు, పరిమితి మించి లోడుతో వాహనాలు నడపడం నేరమని నిబంధనలున్నాయి. అయితే వాటిని అత్రికమించే విధంగా కొంత మంది వాహ నదారుల పరిస్థితి ఉంది. అధిక లోడుతో మలుపుల్లో వెళ్లలేక అదుపుతప్పి వాహనాలు బోల్తా పడిన సంఘటలు కూడా చోటు చేసుకున్నా వాహనాదారులు జాగ్రత్తు పాటించడం లేదు. మండలంలో బీఎస్ రోడ్డుతో పాటు పక్క గ్రామాలకు వెళ్లే దారుల్లో ట్రాక్టర్లపై రైతులు పరిమితికి మించిన ఎత్తు లోడుతో గడ్డి ఒక ప్రాంతంలో కొనుగోలు చేసి మరొక గ్రామాలకు చేరవేస్తున్నారు. దీంతో వెనుక వాహనాలు వెళ్లే పరిస్థితి లేక ట్రాఫిక్ జామ్ అవుతోంది. మలుపు తిరిగే ప్రాంతాల్లో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వాహనాదారులకు అవగాహన కల్పించి, ఎత్తు లోడు రవాణాను నియంత్రించి, ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


కొత్తకోటలో పల్లకీ సేవలో అమ్మవారు

రావికమతం : కొత్తకోటలో వేంచేసియున్న దుర్గాదేవి అమ్మవారి 15వ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ వార్షికోత్సవాలు గురువారం నుంచి మొదలై మూడు రోజుల వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం అమ్మవారిని భక్తులు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, చండీ హోమం, ఆలయ అర్చకులు వేపా రామకృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.